
గండేపల్లి సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ స్టాలిన్ తదితరులు


ముచ్చింతాల లూర్ధుమాత ఆలయ ప్రార్థనల్లో ఫాదర్ క్రీస్తురాజు


రాఘవాపురం సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


బోడవాడ-జమ్మవరంలో లూర్ధుమాత ఆలయంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన


పెనుగంచిప్రోలు షాలోమ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు

## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రంగా వర్ధంతి

**జగ్గయ్యపేట:** పట్టణంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన గురువారం మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహనరంగా వర్ధంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కోదాడ రోడ్డులోని రంగా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా పలు సేవా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు. కావున నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

### మొండితోక కృష్ణకు నివాళి



**చందర్లపాడు(నందిగామ టౌన్):** ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుల తండ్రి మొండితోక కృష్ణ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చందర్లపాడు గ్రామంలోని కృష్ణ సమాధికి జగన్‌మోహనరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జగన్‌మోహనరావు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నేడు చెవిటికల్లులో రెవెన్యూ సదస్సు

**కంచికచర్ల:** మండలంలోని చెవిటికల్లు గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి. జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు అర్జీలు దాఖలు చేసుకోవచ్చని అన్నారు. సర్వే నెంబర్లలో సమస్యలు, కొలతలు, సరిహద్దుల్లో తేడాలున్నట్లయితే మండల సర్వేయర్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొని పరిష్కరించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

### ఆదర్శ ప్రజానాయకుడు కాకాని వెంకటరత్నం



**పెనుగంచిప్రోలు:** రాష్ట్ర రాజకీయాల్లో ఆదర్శ ప్రజానాయకుడు దివంగత మంత్రివర్యులు కాకాని వెంకటరత్నం అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ అన్నారు. కాకాని వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్, పాత సినిమా హాల్ సెంటర్‌లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు నెలకొల్పడంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చేసి క్షీర విప్లవం సాధించిన నేత కాకాని అన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్‌లు జిల్లేపల్లి సుధీర్‌బాబు, కార్యక్రమ నిర్వాహకులు కాకాని వెంకటేశ్వరరావు, కాకాని రవి, బీసీ నాయకులు కొలిపాక బ్రహ్మం, ఏలూరి శ్రీనివాసరావు, కొల్లా వెంకటేశ్వరరావు, విగ్రహ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



**విజయవాడస్పోర్ట్స్:** విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులైన వారికి అరవిన్ ఫౌండేషన్ బుధవారం దుప్పట్లను పంపిణీ చేసింది. ఫౌండేషన్ సమకూర్చిన ఈ దుప్పట్లను వెనుకబడిన, సంచార జాతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సి.చెన్నయ్య, అరవిన్ ఫౌండేషన్ సభ్యుడు బద్వేలు గురుమూర్తి నిరాశ్రయులకు అందజేశారు. దేశంలోని నిరుపేదలకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఎన్ఆర్ఐలు అరుణ, రవి, విన్ని ఈ ఫౌండేషన్‌ను స్థాపించారని చెన్నయ్య, గురుమూర్తి తెలిపారు. ఉద్యోగ రీత్యా వారు అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరనివాసం ఉంటూ మాతృ భూమి రుణం తీర్చుకోవడానికి చేస్తున్న సాయాన్ని అభినందించారు. కార్యక్రమంలో బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు రమణ, బీసీ సంక్షేమ సంఘం బద్వేలు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎం.జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత జీవనమే క్రీస్తు సందేశం

### భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు


జయంతిపురంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు

**వీరులపాడు:** క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిలతో పాటు నిత్య సహాయ మాత ఆలయం, పరిశుద్ధ లూర్ధుమాత దేవాలయాల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొన్ని చర్చిలలో మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతియుత సమాజమే క్రీస్తు సందేశమని పాస్టర్ గొర్రెపాటి రత్నం, ఇమ్మానియేల్ పేర్కొన్నారు. పొన్నవరం గ్రామంలోని గ్రేస్ బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపేలా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, షోడగిరి సతీష్, క్రైస్తవులు పాల్గొన్నారు.

**బోడవాడ-జమ్మవరంలో..**

బోడవాడ, జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్ధుమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. రెవ. ఫాదర్ సాలే వినయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు నన్నెబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కర్ల రాజు, కర్ల రాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని నిత్య సహాయ మాత ఆలయంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి దివ్యబలిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బండి విజయపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జ్ఞానారెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి, నాయకులు పాల్గొన్నారు.

**నందిగామ టౌన్:** పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలోని బ్రిటీష్ కాలం నాటి సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దివ్యబలిపూజ చేశారు. అనంతరం భక్తులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. పట్టణంలోని ఆర్సీఎం, పెంతోకోస్తు, షాలేము, సెవెంత్ డే, సీఎస్ఐ, గలీలియా తదితర ప్రార్థనా మందిరాలతో పాటు మండలంలోని అంబారుపేట, ఐతవరం, కంచల, పెద్దవరం తదితర గ్రామాల్లో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు.

**చందర్లపాడులో..**

మండలంలోని తోటరావులపాడు, కోనాయపాలెం, చందర్లపాడు, తుర్లపాడు, కొడవటికల్లు, చింతలపాడు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసు జననాన్ని స్వాగతిస్తూ ప్రార్థనలు చేశారు.

**కంచికచర్లలో..**

**కంచికచర్ల:** క్రిస్మస్ సందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చి, ఆర్సీఎం చర్చిల్లో పాస్టర్లు ముందుగా కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన శాంతా క్లాజ్ చెట్టు పలువురిని ఆకర్షించింది. అదేవిధంగా మండలంలోని గండేపల్లి సీఎస్ఐ చర్చిలో గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కీసర వెంకట్, బొక్కా జగన్, బొక్కా రమేష్‌లు 25 ఏళ్లగా క్రిస్మస్ కేక్‌ను ఆలయానికి అందజేస్తున్నారని పాస్టర్ కొండా స్టాలిన్ తెలిపారు. రాత్రి సండే స్కూల్ విద్యార్థులు క్రీస్తు పాటలకు డ్యాన్స్‌లతో పాటు మహిళలు కోలాటం ప్రదర్శించారు. మండలంలోని కీసర, గొట్టుముక్కల, పెండ్యాల, వేములపల్లి, ఎస్ అమరవరం, మోగులూరు, చెవిటికల్లు, గనిఆత్కూరు, కొత్తపేట, పరిటాల, బత్తినపాడు, పేరకలపాడు తదితర గ్రామాల్లోని చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**పెనుగంచిప్రోలులో..**

**పెనుగంచిప్రోలు:** క్రిస్మస్ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల చర్చిలు, పలు కూడళ్లలో బుధవారం క్రిస్మస్ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముచ్చింతాల గ్రామంలోని ప్రసిద్ధ లూర్ధుమాత ఆలయంలో క్రీస్తు పుట్టుక, ఆయన మహిమలను భక్తులకు ఫాదర్ క్రీస్తురాజు తెలియజేశారు. మండలంలోని శనగపాడు గ్రామంలో ఫెయిత్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ మేరుగ ఉదయశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలాగే స్థానిక క్రీస్తుదాసుల సియోను ప్రార్థనా మందిరం, జేజీఎం, బెరాకా, షాలోమ్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.

**కిక్కిరిసిన చర్చిలు**

**జగ్గయ్యపేట:** క్రిస్మస్ పర్వదిన వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పోస్టాఫీస్ వద్దనున్న సెయింట్ థామస్ సీఎస్ఐ చర్చి, కోదాడ రోడ్డులోని బెతెస్థ చర్చి, బలుసుపాడు రోడ్డులోని బేతేలు చర్చి, విలియం పేట, క్రిస్టియన్ పేటల్లోని సీఎస్ఐ చర్చిలు, తొర్రకుంటపాలెంలోని సియోన్ చర్చి, ఆర్టీసీ కాలనీలోని హోసన్నా ప్రార్థనా మందిరం, కాకాని నగర్‌లోని షాలేము ప్రార్థనా మందిరంతో పాటు పలు చర్చిలు భక్తులతో కిక్కిరిశాయి. చర్చిలకు విద్యుత్ దీపాలంకరణతో పాటు భారీ స్టార్లు, పశువుల పాకలను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక బాలుర హైస్కూల్ రోడ్డులోని తిరుహృదయ ఆర్సీఎం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు. రెవ. ఫాదర్ కిరణ్‌కుమార్, లూర్ధురాజు సమక్షంలో దివ్యబలిపూజ నిర్వహించారు. గుడిశ జయరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**చిల్లకల్లులో..**

గ్రామంలోని న్యూహోప్, సెయింట్ ఆన్స్ చర్చిల్లో జరిగిన వేడుకల్లో న్యూహోప్ వ్యవస్థాపకుడు ప్రభుదాసు మాట్లాడుతూ జీసస్ బోధనలు ఆచరణీయమన్నారు. జయంతీపురం ఆమోద ఇండస్ట్రీస్‌లో ఎండీ ఉప్పుతోళ్ల కొండలరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆమోద ఇండస్ట్రీస్ సిబ్బంది, నాయకులు వట్టెం మనోహర్, ఫిరోజ్‌ఖాన్, చౌడవరపు జగదీష్, నంబూరి రవి, శ్రీనివాస్ గౌడ్, బద్దునాయక్, బత్తుల రామారావు పాల్గొన్నారు. మండలంలోని బూదవాడ, షేర్‌మహ్మద్‌పేట, మల్కాపురం, గండ్రాయి, బండిపాలెం, తిరుమలగిరి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**వత్సవాయి:** లోక రక్షకుడు ఏసు జన్మించిన పవిత్ర దినం క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండల పరిధిలోని వత్సవాయి, మక్కపేట, పోలంపల్లి, కంభంపాడు, భీమవరం, లింగాల, చిట్టేల, దబ్బాకుపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను చేశారు. అనంతరం కేక్‌లను కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు మతపెద్దలు ఏసుక్రీస్తు మానవాళికి అందించిన సందేశాన్ని భక్తులకు వినిపించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించారు.


పరిటాల యూసీసీఐ చర్చిలో పాస్టర్ ప్రభుదాస్‌పాల్, ఆలయ కమిటీ, స్త్రీల మైత్రీ సభ్యులు, విశ్వాసులు


జగ్గయ్యపేట ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రెవ. ఫాదర్ కిరణ్‌కుమార్



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

### క్రీస్తు జీవితం స్ఫూర్తిదాయకం


నూతన వస్త్రాలు అందజేస్తున్న రామారావు, శ్రీనివాసరావు తదితరులు

**పెనుగంచిప్రోలు:** ఏసుక్రీస్తు ప్రపంచానికి ప్రేమ, శాంతి, సహనం అనే సద్గుణాలను బోధించారని ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ బత్తుల రామారావు అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా సత్రం సెంటర్‌లో రామారావు ఆధ్వర్యాన కేక్ కట్‌చేసి, వృద్ధులకు, వితంతువులు 100 మందికి నూతన వస్త్రాలు, దుప్పట్లు బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు దేరంగుల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, పాస్టర్ చింతల రామారావు తదితరులు పాల్గొన్నారు.


తిరుహృదయ ఆర్సీఎం చర్చిలో ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీ

# మొక్కజొన్నపై రైతుల మక్కువ

- రబీలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో సాగు


పెనుగంచిప్రోలులో సాగవుతున్న మొక్కజొన్న

**పెనుగంచిప్రోలు:** రబీలో మొక్కజొన్న సాగుపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. ఇతర ఆరుతడి పంటలకు బదులుగా మొక్కజొన్న పైనే రైతులు ఆసక్తి చూపించడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పంటలను వేయడానికి ముందే రైతుల సూచనలు, సలహాలు పాటిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఎకరాకి 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి**

నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఈ ఏడాది రైతులు సుమారుగా 3 వేల ఎకరాల్లో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పయినీర్, విన్నర్ వంటి రకాలను ఎక్కువగా ఈ ప్రాంతంలో సాగు చేస్తున్నారు. అంతా అనుకూలిస్తే ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. సాగుకు ఎకరానికి రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం 50 కిలోల బస్తాకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర రూ.2,500 వరకు ఉందని రైతులు అంటున్నారు.

**సస్య రక్షణ చర్యలు...**

రబీ మొక్కజొన్న పంటలో ఎక్కువగా గులాబీ కాండం తొలిచే పురుగు రెండు మూడు వరుసల్లో ఆకు మొదలు, కాండం మధ్యలో గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు నాలుగైదు రోజుల్లో ఎదిగి పిల్ల పురుగులా మారతాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతిని బట్టి 20-25 రోజులకు కార్బోఫ్యూరాన్ 3 కిలోల గుళికలు ఎకరాకు వేయాలి. రైతులు అవగాహనతో గుళికలు చల్లాలి.

### కష్టానికి తగిన ఫలితం



మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ముఖ్యంగా దిగుబడి తగ్గడంతో పాటు చివరిలో కాయ కుళ్లిపోతుండటంతో రైతులు ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రకృతి సహకరిస్తే ఎకరానికి 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుంది. రైతుకు కష్టానికి తగిన ఫలితాన్ని మొక్కజొన్న ఇస్తుంది. –నలజాల శ్రీనివాసరావు, రైతు, ముండ్లపాడు

### సలహాలిస్తున్నాం



రైతులకు పంట సాగుకు కావాల్సిన సలహాలు ఇస్తున్నాం. రైతులు రబీలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం మంచిది. రైతులకు అవసరమైన అవగాహన కూడా కల్పిస్తున్నాం. ఈ పంట సాగుకు ఖర్చు తక్కువ. చీడపీడల సమస్య కూడా తక్కువ. పంటల మార్పిడి వల్ల భూసారం పెరుగుతుంది. –సి భవాని, ఏడీ, జగ్గయ్యపేట

### ఆలయ నిర్మాణానికి వితరణ



**తిరువూరు:** స్థానిక జగన్నాథపురంలోని పాటిమీద దాసాంజనేయస్వామి దేవస్థాన నిర్మాణానికి దాతలు బుధవారం విరాళాలు అందజేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు కొత్తూరు సత్యనారాయణ, కొత్తూరు ప్రసాదరావు ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. 2025 ఫిబ్రవరిలో ఆలయ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.


### అన్నమాచార్యుల కీర్తనల ఉచిత శిక్షణ

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** రామకృష్ణాపురం శ్రీ అలమేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలకు అన్నమాచార్యుల కీర్తనలు, సంగీత ఉచిత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

### 108 వెండి తమలపాకులు వితరణ

**మేడూరు(గంపలగూడెం):** మండలంలోని మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి అలంకరించేందుకు భక్తుడు 108 తమలపాకులను బుధవారం ఆలయ అర్చకులు కోమండూరి ఆంజనేయాచార్యులకు వితరణ చేశారు. తిరువూరు పట్టణానికి చెందిన నాళ్ళా వెంకటనరసింహారావు రూ.6,37,725 విలువైన తమలపాకులను తయారు చేయించి ఆలయంలో ఇచ్చారు. తమలపాకులకు అర్చకులు ప్రత్యేకపూజ చేసిన స్వామికి అలంకరించారు. దాత నాళ్ళా వెంకటనరసింహారావు, కుటుంబీకులను స్వామి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వదించి, ప్రసాదం అందజేశారు.

### అయ్యప్ప స్వామికి అభిషేకాలు



**ఆగిరిపల్లి:** స్థానిక సత్రం సెంటర్లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులు మణికంఠునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెజవాడ శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు పంచామృతాలతో మణికంఠునికి అభిషేకాలు, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు.

# భవానీల సేవలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ఇంద్రకీలాద్రి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 200 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవలు అందించినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన భవానీ దీక్షల విరమణ సేవలో భక్తులకు సేవలు అందించేందుకు గాను జిల్లా కలెక్టర్ ఆహ్వానం మేరకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు క్యూలైన్‌లో నియంత్రణ, అన్న ప్రసాదాల వితరణ, వికలాంగులకు సేవలు, తాగునీటి సరఫరా, వైద్య సేవలను అందించారని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలను దేవస్థానం అధికారులు ప్రశంసించినట్లు తెలిపారు.

### లక్ష తులసీ పూజ


శ్రీవీరాంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన ధనుర్మాస పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

**తిరువూరు:** స్థానికంగా పలు దేవాలయాల్లో బుధవారం విశేష పూజలు జరిగాయి. శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి దేవాలయంలో లక్ష తులసీ దళాలతో జరిగిన విశేషార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోదండ రామాలయం, శ్రీవేంకటాచలస్వామి దేవస్థానం, రాజుపేట

### సాంస్కృతిక కళా వేదిక నిర్మాణానికి విరాళం


సీపీఎం నాయకులకు విరాళం అందజేస్తున్న వెంకట సుబ్బమ్మ

**కృష్ణలంక(విజయవాడ తూర్పు):** రాణిగారితోటలోని సుందరయ్య గ్రంథాలయంలో సాంస్కృతిక కళా వేదిక నిర్మించేందుకు సీపీఎం నాయకులకు బుధవారం కృష్ణలంకకు చెందిన నడికట్టు వెంకట సుబ్బమ్మ భారీ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ మంచి ఆలోచనతో కళా వేదిక నిర్మాణానికి భారీ విరాళం అందజేసిన సుబ్బమ్మను అభినందించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత నడికట్టు వెంకటరెడ్డి, వారి పిల్లల పేరు మీద మెమోరియల్ హాల్ ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.కాశీనాథ్, ఎస్.హరినారాయణ, చంద్రశేఖర్, కృష్ణ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.